సాక్షి వనపర్తి
శనివారం । 23 । ఆగస్టు । 2025



మళ్లీ చిరుత కలకలం

గండేడ్ మండలం లింగాయిపల్లి గేటు సమీపంలో శుక్రవారం చిరుత రోడ్డు దాటుతూ గ్రామస్తుడికి మళ్లీ కనిపించింది.

-8లో ▸



కొనసాగుతున్న వరద

జూరాల జలాశయానికి శుక్రవారం 3.55 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 34 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
32.5/22.4

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అధికారుల్లో 'ఆర్టీఐ' వణుకు..

వనపర్తి: సుదీర్ఘకాలంగా సమాచార కమిషనర్ లేక పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించేందుకు శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సమాచారం ఇచ్చే విషయంలో అర్జీలను నిర్లక్ష్యం చేసిన కొన్ని శాఖల అధికారులు ప్రత్యేక విచారణలో ఎలాంటి ప్రశ్నలు తలెత్తుతాయనే భయంతో అర్జీదారులతో రాజీ పత్రాలు రాయించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్దేశపూర్వకంగా సమాచార హక్కు చట్టం-2005ను నిర్లక్ష్యం చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోననే ఆందోళన అధికారుల్లో కనిపించింది. జిల్లాలో మొత్తం 90 అర్జీలు పెండింగ్‌లో ఉండగా.. మున్సిపాలిటీలు, రెవెన్యూశాఖకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

'అమృత్ 2.0' నీటి ట్యాంకుల పరిశీలన

అమరచింత: అమృత్ 2.0 పథకంలో భాగంగా జిల్లాలోని మున్సిపాలిటీల్లో చేపడుతున్న నీటి ట్యాంకుల నిర్మాణ పనులను శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఇంటర్నల్ రిపోర్టింగ్, మానిటరింగ్ ఏజెన్సీ బృందం పరిశీలించింది. వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింతలో కొనసాగుతున్న నీటిట్యాంకుల నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలలకు ఓసారి ఇర్మా ఆధ్వర్యంలో పనులను పరిశీలించి నాణ్యత వివరాలను కేంద్రానికి నివేదిస్తున్నట్లు వెల్లడించారు. డీఈ చంద్రశేఖర్, కంపెని మేనేజర్ ఎస్.శ్రీనివాసులు, ఇర్మా కో-ఆర్డినేటర్ నవీన్ పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి



వనపర్తిటౌన్: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించే ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రవిప్రసాద్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించడంతో పాటు ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేష్, కె.జ్యోతి, హమీద్, శ్రీనివాస్‌గౌడ్, రామన్‌గౌడ్, జి.మురళి, అరుణ, వెంకటేశ్వర్లు, సూరయ్య, మల్లికార్జున్, డి.రాముడు, మద్దిలేటి, రాములు యాదవ్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

వనపర్తి విద్యావిభాగం: జిల్లాకేంద్రంలోని బాలానగర్‌లో ఉన్న 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో అదనంగా 55 హెపీ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు సందర్భంగా శనివారం ఉదయం 9 నుంచి 11 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలానగర్, నర్సింగాయపల్లిరోడ్‌లోని డిగ్రీ కళాశాల, మెటర్నిటీ, చిల్డ్రన్ ఆస్పత్రి, అప్పాయపల్లిరోడ్, నందిమళ్లగడ్డ, వశ్యానాయక్‌తండా, పాతబజార్, కుమ్మరిగేరి, సవరం స్ట్రీట్, కమలానగర్, గాంధీనగర్, రాయిగడ్డకాలనీ, రాంనగర్‌కాలనీ, బ్రహ్మంగారి వీధి, శారదనగర్, చిట్యాలరోడ్, శ్వేతానగర్, తిరుమలకాలనీ, వల్లభ్‌నగర్, పీర్లగుట్ట, బంగారునగర్, పాన్‌గల్ రోడ్, గాంధీచౌక్, భగత్‌సింగ్‌నగర్, మెంటేపల్లితో పాటు చిన్నగుంటపల్లి, గోపాల్‌పేట, రాజపేట ఫీడర్‌లోని ప్రాంతాలకు ఆయా సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని.. గృహ, వ్యాపార, పరిశ్రమలు, వ్యవసాయ వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

కోయిల్‌సాగర్ గేట్ల మూసివేత

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్లను శుక్రవారం ఉదయం నుంచి మూసివేశారు. గురువారం రెండు గేట్లను తెరిచి నీటిని వదిలిన విషయం తెలిసిందే. అయితే రెండు రోజుల నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఎగువ నుంచి పెద్ద వాగు ప్రవాహం తగ్గిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా ప్రస్తుతం 32 అడుగుల వద్ద 2.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పోరాట యోధుడు సురవరం

చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో కన్నుమూత

- దేశ, రాష్ట్ర రాజకీయాల్లో రాణించిన నేత
- మూడుసార్లు సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నిక
- నల్లగొండ నుంచి రెండుసార్లు ఎంపీగా సేవలు
- స్వగ్రామం కంచుపాడులో విషాదఛాయలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ అలంపూర్: విద్యార్థి నేతగా.. పోరాట యోధుడిగా.. జాతీయ స్థాయిలో రాణించిన సురవరం సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారన్న సమాచారంతో ఆయన స్వగ్రామం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలోని కంచుపాడులో తీవ్ర విషాదం అలుముకుంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఈయన సీపీఐలో మూడు సార్లు పార్టీ ఉన్నత పదవి జాతీయ కార్యదర్శి హోదాను దక్కించుకున్నారు. మారుమూల గ్రామంలో పుట్టిన సురవరం సుధాకర్‌రెడ్డి సీపీఐ అత్యున్నత పదవిని దక్కించుకొని రాష్ట్రానికి, గ్రామానికి వన్నె తెచ్చారు.

విద్యార్థి దశ నుంచే..

సురవరం సుధాకర్‌రెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర వహించారు. పోరాట పటిమగల కుటుంబంలో జన్మించిన సుధాకర్‌రెడ్డి సైతం విద్యార్థి దశ నుంచే పలు ఉద్యమాలు చేపట్టి రాజకీయాల్లో రాణించారు. ఉస్మానియా కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలోనే విద్యార్థి సమస్యలపై పోరాడుతూ స్టూడెంట్ యూనియన్ నాయకుడిగా ఎదిగారు. విద్యాభ్యాసం కొనసాగుతున్న సమయంలో విద్యార్థి కమ్యూనిస్టు విభాగంలో పనిచేస్తున్న సుబ్బన్న, రాజన్నల ప్రోద్బలంతో పనిచేశారు. అనంతరం నీలం రాజశేఖర్‌రెడ్డి సహాయ, సహకారాలతో రాజకీయాల్లో రాణించారు. బాల్యం నుంచి నాయకత్వ లక్షణాలు అలవరుచుకున్న ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కీలక వ్యక్తిగా ఎదిగారు.

⇨ సీపీఐ పార్టీ జాతీయ కార్యదర్శిగా 2012, 2015, 2017లో మూడుసార్లు జాతీయ పదవిని దక్కించుకొని పార్టీకి, ప్రజలకు సేవలందించారు. జాతీయ స్థాయి పదవిని మూడుసార్లు దక్కించుకొని రాష్ట్రానికి, సొంత గ్రామానికి వన్నె తెచ్చారు.

⇨ అప్పటికే కమ్యూనిస్టు రాజకీయాలతో ఉన్న అనుబంధం కారణంగా 19 ఏళ్లకే ఏఐఎస్ఎఫ్ కర్నూలు టౌన్ కార్యదర్శిగా, 1960 జిల్లా కార్యదర్శిగా ఎదిగారు. ప్రతి విద్యార్థికి చదువు, పోరాటం రెండు కళ్లు అని చెప్పే సురవరం జీవితంలో రెండు మరిచిపోని సంఘటనలున్నాయి. ఒకటి బ్లాక్ బోర్డుల ఉద్యమమైతే.. మరొకటి 1962లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన 62 రోజుల నిరవధిక సమ్మె ఆయన నాయకత్వంలోనే జరిగింది. ఆ తర్వాత ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, మరుసటి ఏడాది జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

స్వగ్రామం కంచుపాడు..

సురవరం సుధాకర్‌రెడ్డి జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఉండవెల్లి మండలంలోని కంచుపాడు గ్రామంలో మార్చి 25, 1942 సంవత్సరంలో జన్మించారు. సురవరం వెంకట్రామిరెడ్డి, ఈశ్వరమ్మ దంపతులకు సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పుష్పలత నలుగురు సంతానం. కాగా అందరిలో పెద్దవాడైన సుధాకర్‌రెడ్డి విద్యాభ్యాసం కర్నూలు మున్సిపల్ పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సీ, ఉస్మానియా కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో లా చదివారు. 1974 ఫిబ్రవరి 14న వివాహం కాగా.. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.



ఉండవల్లి మండలం కంచుపాడులోని తన ఇంటి వద్ద సురవరం (ఫైల్)

రాజకీయాల్లో చెరగని ముద్ర..

సురవరం సుధాకర్‌రెడ్డి రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో రాణించారు. 1971లో సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్‌లోని ఆయన తల్లి తరపు బంధువులు కమ్యూనిస్టు భావాలను స్వాగతించడంతో 1985, 1990లో ఎమ్మెల్యేగా పోటీ చేసినా.. రెండు ఎన్నికల్లోనూ ఆయన స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గం నుంచి 1994లో పోటీ చేశారు. ఇక్కడ కూడా ఆయనకు విజయం దక్కలేదు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో రాణిస్తూ రాజధానికి మకాం మార్చిన ఆయన నల్లగొండ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి 1998, 2004లో పోటీ చేసి విజయం సాధించారు. కానీ, స్థానికంగా పోటీకి మాత్రం దూరంగా ఉండటం విశేషంగా చెప్పవచ్చు. ఆ తర్వాత ఆయన జాతీయ రాజకీయాల్లో రాణించారు. పార్టీ అత్యున్నత స్థానంగా భావించే జాతీయ కార్యదర్శి హోదా దక్కించుకున్నారు. 2012లో ఆయన సీపీఐ జాతీయ కార్యదర్శిగా తొలిసారి ఎన్నికయ్యారు. 2019 వరకు ఆ పదవిలో కొనసాగారు.

ప్రధాన కార్యదర్శి పదవిని రెండుసార్లు నిర్వహించిన సురవరం ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగాను పనిచేశారు. 1972లో ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా ఉంటూ పలు అంతర్జాతీయ సదస్సులకు ప్రాతినిధ్యం వహించారు. ఈ కాలంలో జై ఆంధ్ర ఉద్యమానికి వ్యతిరేకంగా చురుగ్గా పనిచేశారు. కొచ్చిన్‌లో జరిగిన సీపీఐ 9వ జాతీయ మహాసభలో జాతీయ కౌన్సిల్‌కు ఎంపికయ్యారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చిన సురవరం పార్టీ రాష్ట్ర వ్యవహారాల్లో క్రియాశీలకమయ్యారు.

స్వగ్రామంలో సేవా కార్యక్రమాలు..

సురవరం సుధాకర్‌రెడ్డి జాతీయ స్థాయికి ఎదిగినా స్వగ్రామంపై ఉన్న మమకారంతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నిరుద్యోగ యువత కోసం వెంకట్రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. దీని ద్వారా గ్రామీణ యువతీ, యువకులకు ఉచిత కంప్యూటర్, కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలను అందించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన కార్యక్రమాలు, వృత్తి విద్య కోర్సులు ఏర్పాటు చేసి యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడానికి కృషి చేశారు. యువతకు ఉపాధితో పాటు క్రీడలను ప్రోత్సహించారు.



కళాశాలలో అధ్యాపకులు, మిత్రులతో సుధాకర్‌రెడ్డి (ఫైల్)



గ్రామస్తులతో మాట్లాడుతున్న సురవరం(ఫైల్)

కళాశాలల్లో వసతులేవి..?

విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో పలు బీఈడీ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు



పీయూ అడ్మినిస్ట్రేషన్ భవనం

- ఏడింటిలో పూర్తిస్థాయిలో వసతులు లేవని గుర్తించిన వీసీ
- మరో 7 కళాశాలలకు షోకాజ్ నోటీసులు
- గతంలో అఫ్లియేషన్ తనిఖీలు నిర్వహించిన అధికారులపై విమర్శలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం లేదని మరోసారి తేటతెల్లమైంది. చాలా కళాశాలల్లో అర్హులైన సిబ్బంది నియామకం పూర్తిస్థాయిలో లేకపోవడం, ల్యాబ్స్, మరుగుదొడ్లు, విద్యార్థులు కళాశాలకు రావడం లేదని తదితర అంశాలపై విద్యార్థి సంఘాల నాయకులు వీసీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయడంతో ఇటీవల పలు కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో 7 కళాశాలల్లో అర్హులైన అధ్యాపకులు, పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడం వంటివి గుర్తించి.. ఆయా కళాశాలలకు వెంటనే నోటీసులు ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. అయితే నోటీసులకు అన్ని కళాశాలల నుంచి సమాధానం రావడంతో వాటిని పరిశీలించి తదుపరి చర్యలను తీసుకోనున్నట్లు యూనివర్సిటీ అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో ఓ కళాశాలపై చర్యలు సైతం తీసుకోనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. డిగ్రీతోపాటు ఇతర కళాశాలలపై నిర్వహించాల్సిన అఫ్లియేషన్, ర్యాటిఫికేషన్‌ను అధికారులు ఇప్పటి వరకు నిర్వహించకపోవడం గమనార్హం.

నామమాత్రంగా చేశారా..

పీయూ పరిధిలోని 29 బీఈడీ కళాశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభంలో అఫ్లియేషన్ కోసం అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే అధికారులు సంబంధిత కళాశాలలో నిబంధనలు పాటించని వాటికి సిబ్బంది, వసతులు తదితర అంశాలను సమకూర్చుకోవాలని రిమార్క్ రాయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అధికారులు రిమార్క్ చూపించారా.. లేక నామమాత్రంగా తనిఖీలు చేశారా.. అనేది ప్రశ్నగా మిగిలింది. తాజాగా అఫ్లియేషన్ తనిఖీలు చేసిన కళాశాలల్లోనూ వసతులు లేవని విద్యార్థి సంఘాలు ఫిర్యాదులు చేసే వరకు చర్యలు తీసుకోకుండా అధికారులు ఏం చేశారన్నది చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రైవేటు కళాశాలలను ఒక వీసీ నేరుగా వసతులపై తనిఖీలకు వెళ్లడం ఇదే మొదటిసారి కావడం విశేషం. కిందిస్థాయి సిబ్బంది ప్రైవేటు కళాశాలల్లో పర్యవేక్షణను పట్టించుకోవడం లేదన్న విమర్శల నేపథ్యంలో వీసీ నేరుగా తనిఖీలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

7 కళాశాలలకు నోటీసులు

పీయూ వీసీ శ్రీనివాస్ మొత్తం 10 కళాశాలల్లో తనిఖీలు నిర్వహించగా.. ఇందులో 7కళాశాలలకు నోటీసులు ఇచ్చారు. ఇందులో సెయింట్ మేరీస్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, అల్ మదీనా కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, నలంద కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఆదర్శ కళాశాల ఎడ్యుకేషన్, శ్రీవాసవీ ప్రతాపరాజ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, పాలమూరు కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో కొన్నింటిలో ర్యాటిఫికేషన్ సమయంలో చూపించిన అధ్యాపకులు తనిఖీల సమయంలో లేకపోవడం, ల్యాబ్స్, లైబ్రరీలు, ఇతర వసతులు లేకపోవడం, ఉన్న సిబ్బందిలో నెట్, సెట్, పీహెచ్‌డీ వంటి అర్హతలు లేకపోవడం వంటివి ఉన్నాయి. వీటితోపాటు ఎస్‌డీఎం కాలేజీ ఆఫ్ లా వనపర్తికి నోటీసులు ఇచ్చారు. ఈ కళాశాల ప్రారంభం నుంచి సిబ్బందికి సంబంధించి అసలు ర్యాటిఫికేషన్ చేయించుకోలేదని, అందుకు అధికారులు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. నోటీసులకు సమాధానం ఇచ్చిన కళాశాలల్లో సెయింట్ మేరీస్ కళాశాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. కళాశాలలో బీఈడీలో ఇన్‌టెక్ 100 మంది కాగా ఇందులో 50 శాతం సీట్లకు కోత విధించారు. అంటే 50 సీట్లను తక్కువగా అడ్మిషన్ చేసుకోవాల్సి ఉంది. త్వరలో మరిన్ని కళాశాలలపై చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తుంది.

నోటీసులిచ్చిన తదుపరి చర్యలు..



పలు బీఈడీ కళాశాలల్లో ఆకస్మికంగా గతంలో తనిఖీలు నిర్వహించి.. వసతులు, నిబంధనలు పాటించని మొత్తం 7 కళాశాలలకు నోటీసులు ఇచ్చాం. వారు సమాధానం ఇస్తే పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం. అంతేకాకుండా డిగ్రీ కళాశాలలపై కూడా ర్యాటిఫికేషన్, అఫ్లియేషన్ తనిఖీలు నిర్వహిస్తాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నాం. సెయింట్ మేరీస్ కళాశాలపై చర్యల్లో భాగంగా 50 శాతం సీట్లను కుదించాం.

– శ్రీనివాస్, వీసీ, పీయూ

తనిఖీలు చేపట్టాం..



గతంలో మొదటిసారి తనిఖీలు నిర్వహించిన క్రమంలో కళాశాలల్లో లేని వసతులపై రిమార్కులు కళాశాల వారికి చూపించాం. మార్పులు లేనందుకు మరోసారి వీసీ నేరుగా తనిఖీలు చేసి.. వసతులు లేని 7 కళాశాలలకు నోటీసులు ఇచ్చారు. గతంతో పోలిస్తే తనిఖీలు మెరుగుపడ్డాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నాం.

– చంద్రకిరణ్, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్

ఇందిరమ్మ రాజ్యంలోనే సంక్షేమ ఫలాలు



సల్కెలాపురం గ్రామంలో మార్నింగ్ వాక్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘనపురం: ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన పోచమ్మ బోనాల్లో పాల్గొన్న ఆయన రాత్రి తన స్వగ్రామం సల్కెలాపురంలో బసచేశారు. శుక్రవారం ఉదయం గ్రామంలో మార్నింగ్‌వాక్ నిర్వహించారు. వీధుల్లో తిరిగి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురయ్యామని పలువురు మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రూ.20 లక్షలతో కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత తొలగిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అప్పారెడ్డిపల్లికి చెందిన కొత్తగొల్ల అంజమ్మ ఉపాధి నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన నాటుకోళ్ల ఫాంను ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఖిల్లా ఘనపురం-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రూ.2.95 కోట్లతో నిర్మించిన హైలేవల్ వంతెనను ప్రారంభించడంతో పాటు రూ.45 లక్షలతో నిర్మించే మత్స్యకారుల సామూహిక భవనానికి భూమి పూజ చేశారు. సింగిల్‌విండో అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ రాజు, మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, నాయకులు సాయిచరణ్‌రెడ్డి, ఆగారం ప్రకాష్, వెంకటేశ్వర్‌రావు, విజయ్‌కుమార్, గంజాయి రమేష్, నాగేశ్వర్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం..

గోపాల్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు నాగేషు మరణించిన విషయం తెలుసుకొని కుటుంబాన్ని పరామర్శించాడు. అనంతరం బుద్దారం గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని, చాకల్‌పల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. రేవల్లి మండలంలోని తల్పునూరుతండాలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్త బండరావిపాకులలో ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఏదుల, చెన్నారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు, కేశంపేట గేట్‌వద్ద హై లేవెల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఆగస్టులో రూ.3.50 కోట్ల రుణాలిచ్చాం : డీసీసీబీ

వనపర్తి: జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకు పరిధిలోని ఆరు పీఏసీఎస్‌ల పరిధిలో ఉన్న రైతులకు ఆగస్టులో వివిధ రకాల రుణాలు రూ.3.50 కోట్లు అందజేసినట్లు డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని కో-ఆపరేటివ్ బ్యాంకులో పలువురు లబ్ధిదారులకు కర్షక మిత్ర చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగమైన పాడి పశువుల పోషణ, ఇతర వ్యాపారాలకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రెండు ఎకరాలు అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు కర్షక మిత్ర పథకంలో భాగంగా రుణ చెక్కులను పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నాగవరం పీఏసీఎస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, రాజనగరం పీఏసీఎస్ చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన అజెండా

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధే ప్రధాన అజెండాగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'పనుల జాతర' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్వయం ఉపాధి పనులకు సంబంధించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అధికారులతో కలిసి ఆయన అందజేశారు. అనంతరం మండలంలోని నాటవెల్లిలో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న యూపీఎస్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్య, మౌలిక వసతులు, ఉపాధి రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. సంక్షే, అభివృద్ధి ఫలాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు పి.కృష్ణారెడ్డి, ఎన్‌జే బోయేజ్, రావుల కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, బీచుపల్లి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

రాజా బహదూర్ వెంకట రామరెడ్డికి నివాళి..

రాజా బహదూర్ వెంకట రామరెడ్డి జయంతి సందర్భంగా రాయిణిపేట శివారులో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహనీయుడు, గొప్ప సంఘసంస్కర్త అయిన వెంకట రామరెడ్డి ఈ గడ్డపై జన్మించడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రెడ్డి సేవాసమితి సభ్యులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల సంబురం



జిల్లా కేంద్రంలోని పోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



వనపర్తిటౌన్: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా జిల్లాకేంద్రంలో కర్రెమ్మ, పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కర్రెమ్మ బోనాన్ని డప్పుచప్పుళ్లు, టపాసుల మోత నడుమ మధ్యాహ్నం 2.30 గంటలకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. దళితవాడ, గాంధీనగర్ 1, 2, మారెమ్మకుంట, అంబేడ్కర్‌నగర్, ప్యాటగడ్డ తదితర కాలనీల వాసులు పోచమ్మకు ఊరేగింపుగా బోనాలు తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పించారు. బోనాల ఊరేగింపుతో వీధులన్నీ సందడిగా మారాయి. మహిళల బొడ్డెమ్మలు, యువకుల నృత్యాలు, కోలాటాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలువురు కోళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

ఉరేసుకొని ఉపాధ్యాయురాలి ఆత్మహత్య

- భార్యాభర్తల మధ్య జరిగిన గొడవతో మనస్తాపం



పూర్ణ(ఫైల్)

జడ్చర్ల: సంసారం విషయంలో వచ్చిన ఓ చిన్న గొడవ ఉపాధ్యాయురాలి బలవన్మరణానికి దారి తీసిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం తండాకు చెందిన ముడావత్ పూర్ణ (40) మండల పరిధిలోని నసరుల్లాబాద్‌లోని పాఠశాలలో విధులు నిర్వర్తిస్తుంది. ఆమె భర్త రమావత్ బోప్య కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. వారు ముగ్గురు పిల్లలతో కలిసి స్థానిక గౌరీశంకర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తలు గురువారం గొడవ పడ్డారు. శుక్రవారం భర్త బోప్య యథావిధిగా విధులకు హాజరయ్యేందుకు వెళ్తూ సాయివంశీ కాలనీలో నివాసం ఉంటున్న తన బావమరిది ముడావత్ గణేష్‌కు ఫోన్‌చేసి మీ అక్కతో వాగ్వాదం జరిగింది. ఇంటికి వెళ్లి విచారించమని చెప్పాడు. ఇంటికి వెళ్లిన గణేష్ తలుపు తీయకపోవడంతో తలుపు పగులగొట్టి చూడగా పూర్ణ బెడ్రూంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని ఉంది. గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇస్త్రీ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్

- చికిత్స పొందుతూ మహిళ మృతి



సజనోళ్ల అనంతమ్మ(ఫైల్)

మరికల్: దుస్తులను ఇస్త్రీ చేస్తుండగా.. షార్ట్‌సర్క్యూట్ రావడంతో మహిళ మృతి చెందిన ఘటన గురువారం రాత్రి అప్పంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మరికల్ మండలం అప్పంపల్లికి చెందిన సంజనోళ్ల అనంతమ్మ(59) ఇంట్లో దుస్తులను ఇస్త్రీ చేస్తుండగా.. ఆకస్మాతుగా ఇస్త్రీ పెట్టెకు షార్ట్ సర్క్యూట్ రావడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మరికల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొదుంతూ మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుసినట్లు ఎస్ఐ రాము తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, కుమార్తే ఉన్నారు.

మతిస్థిమితం లేని మహిళ దాడి.. వృద్ధుడి మృతి

ఊర్కొండ: మతిస్థిమితం లేని మహిళ దాడిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని రాంరెడ్డిపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రాంరెడ్డిపల్లికి చెందిన జమ్ముల లక్ష్మీదేవమ్మకు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో భర్త ఇదివరకే వదిలిపెట్టడంతో ఆమె తల్లివద్దనే ఉంటోంది. ఆమె ఇద్దరు కుమారులు భర్త వద్దే హైదరాబాద్‌లో ఉంటున్నారు. గురువారం రాత్రి గ్రామానికి చెందిన గుర్రంపల్లి రాములు(65)కావలికారు(వీఆర్ఏ)గా విధులు నిర్వహిస్తున్నాడు. కిరాణం షాపు వద్దకు వెళ్లి మహిళ ఇంటిముందు రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా లక్ష్మీదేవమ్మ మాటలు కలిపి మాట్లాడుతూ.. వెంట తెచ్చుకున్న కట్టెతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే కల్వకుర్తి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శుక్రవారం ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ నాగార్జున పరిశీలించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

నవాబుపేట: చేపలు పట్టేందుకు వెళ్లిన ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కాకర్‌జాల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాకర్‌జాల్‌కు చెందిన గుర్రంపల్లి చెన్నయ్య(35) బుధవారం గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెన్నయ్య భార్య స్వప్న ఉడిత్యాల్ శివారులో కూలి పనులకు వెళ్లింది. ఈ క్రమంలో ఇంటి దగ్గర ఉన్న చెన్నయ్య కూమార్తె తండ్రి ఇంటికి రాలేదని రాత్రి తన తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. చుట్టు పక్కల వెతకగా ఎక్కడా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువులో చెన్నయ్య శవం నీటిపై తేలడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇటిక్యాల: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవినాయక్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని చాగాపురానికి చెందిన గొల్ల శేఖర్(వీరేష్, 26) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. జూలై 28న తల్లి చిన్నక్కను మద్యం తాగడానికి డబ్బులు అడగ్గా ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్థాపానికి గురై పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. శుక్రవారం మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మళ్లీ చిరుత కలకలం



చిరుత సంచారంపై వివరాలు సేకరిస్తున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాఘవేంద్ర

- లింగాయిపల్లి గేటు వద్ద రోడ్డు దాటిన వైనం
- భయంతో వెనుదిరిగిన వాహనదారుడు
- పరిసరాలను పరిశీలించిన అటవీ అధికారి

గండేడ్: ఐదు రోజుల క్రితం స్థానికంగా కలకలం రేపిన చిరుత తాజాగా మళ్లీ ప్రత్యక్షమైంది. శుక్రవారం చిరుత రోడ్డు దాటుతూ వాహనదారుడికి కనిపించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు మరో మారు చిరుత జాడ కోసం గాలింపు చేపట్టారు. వివ... రాల్లోకి వెళితే.. మండలంలోని లింగాయిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ గత్ప నరేష్ మంగళ... వారం సాయంత్రం బైక్‌పై రం... గారెడ్డిపల్లి నుంచి స్వగ్రామానికి వస్తుండగా చింతగుట్టకు వెళ్లే దారి వద్ద చిరుత అకస్మాత్తుగా రోడ్డు దాటేందుకు దూకింది. అదే సమయంలో బైక్‌పై అక్కడికి చేరుకున్న నరేష్ ఎడమ చేతికి చిరుత కాలు తగలడంతో గాయం అయ్యింది. అప్పట్లో విషయం తెలుసుకున్న ఫారెస్టు డిప్యూటీ రేంజర్ రాఘవేంద్ర చిరుత రోడ్డు దాటిన ప్రదేశాన్ని సందర్శించి, పరిసరాలను పరిశీలించాడు. అయినా ... చిరుత ఆచూకీ దొరకలేదు.

ఇది మూడోసారి..

లింగాయిపల్లి ప్రాంతంలో గతంలో కూడా చిరుత సంచరించిందన్న వార్తల నేపథ్యంలో సమీప గ్రామాలైన రంగారెడ్డిపల్లి, సల్కర్‌పేట్, వెన్నాచేడ్, లింగాయిపల్లి వాసులు భయం గుప్పిట్లో ఉన్నారు. ప్రస్తుతం కూడా ఇదే ప్రాంతంలో తిరిగి మూడోసారి కనిపించడంతో గొర్రెల, మేకల, పశువుల కాపరులతో పాటు పొలాలకు వెళ్లేవారు జంకుతున్నారు.

ఐదో రోజు తిరిగి ప్రత్యక్షం

ఐదు రోజుల తర్వాత చిరుత మళ్లీ కంటపడడం కలకలం రేపింది. మండలంలోని రంగారెడ్డిపల్లికి చెందిన రాజేందర్ శుక్రవారం ఉదయం 7:30 గంటలకు దాదాపూర్ వెళ్లడానికి బయలుదేరాడు. ఈ క్రమంలో అతడు లింగాయిపల్లి గేటు దాటి కొద్ది దూరం వెళ్లగా చిరుత రోడ్డు దాటుతూ బూకలి నర్సింలు మామిడితోటలోకి వెళ్లడాన్ని గమనించి, ... తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. చిరుత ... రోడ్డు దాటిన ప్రదేశానికి కొద్ది దూరం ... లో గొర్రెల మంద ఆపారు. మం... దకు కాపలాగా ఉన్న వెన్నాచేడ్ ... రాజు కుమార్తె భయంతో చెట్టు ఎక్కి కూర్చుంది. తర్వాత తండ్రి వచ్చాక కిందికి దిగి ఇంటికి వెళ్లిపోయింది.

ఆనవాళ్లు సరిపోతున్నాయి

లింగాయిపల్లి సమీపంలో చిరుత సంచారం సమాచారం అందుకున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మరోమారు చిరుత సంచరించిన స్థలాన్ని పరిశీలించారు. దానికి సంబంధించిన పాదముద్రల గురించి వెతికారు. చుట్టుపక్కల రైతులతో మాట్లాడారు. సమీపంలో గల పౌల్ట్రీఫాంను కూడా ఆయన పరిశీలించారు. అనంతరం రాజేందర్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి, విషయం తెలుసుకున్నారు. దీంతో అతను చెప్పిన విషయాలు చిరుతను పోలి ఉన్నాయని తెలిపారు. విషయాన్ని మహమ్మదాబాద్ ఫారెస్టు రేంజర్ అబ్దుల్ హైకి వివరించారు. చిరుత మళ్లీ కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వీలయితే ఫొటో తీయాలని ఆయన స్థానికులకు సూచించారు. దానిని బట్టి బోను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు.

జూరాలకు 3.55లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు పరుగులు పెడుతున్న వరద

- ప్రాజెక్టు 34 క్రస్టు గేట్ల ఎత్తివేత
- దిగువకు 3.50లక్షల క్యూసెక్కులు

ధరూరు: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శుక్రవారం రాత్రి 7.30 గంటల వరకు 3.55లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 34 క్రస్టు గేట్లను ఎత్తి 3.49 లక్షల క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 37 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 550 క్యూసెక్కులు, కుడి కాల్వకు 430 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.431 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రెండో రోజు జెన్కో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

ఆల్మట్టి, నారాయణపూర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 97.277 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 2.11లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 25.658 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 2.61లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువన ఉన్న జూరాలకు 30 గేట్లను ఎత్తి ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: ఎగువ నుంచి సుంకేసుల ప్రాజెక్టుకు 1.4లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. మూడు గేట్లను ఒక మీటర్ మేర, 17 గేట్లను రెండు మీటర్ల మేర తెరిచి 1.35 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్ 2,534 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

25లీటర్ల ఆర్మీ మద్యం బాటిల్స్ సీజ్



సీజ్ చేసిన మద్యం బాటిల్స్. పక్కనే మద్యం విక్రయించిన సుదర్శన్‌రెడ్డి

పాలమూరులో గుట్టుగా దందా నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

మహబూబ్‌నగర్ క్రైం: విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల నుంచి తక్కువ ధరకు మద్యం బాటిల్స్ విక్రయించి.. వినియోగదారులకు అధిక ధరకు విక్రయించే ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎక్సైజ్ అధికారి సుధాకర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలోని వందన విహార్ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే సుదర్శన్‌రెడ్డి కొన్నిరోజుల నుంచి విశ్రాంత ఆర్మీ అధికారులు, సిబ్బంది వద్ద తక్కువ ధరకు మద్యం బాటిల్స్ కొనుగోలు చేసి మార్కెట్‌లో అవసరమున్న వ్యక్తులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో శుక్రవారం అతని ఇల్లు తనిఖీ చేయగా.. 33డిఫెన్స్ మద్యం బాటిల్స్ దాదాపు 25లీటర్లు లభ్యం కాగా.. వాటిన సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మద్యం విలువ దాదాపు రూ.90వేల వరకు ఉంటుందని తెలిపారు. సుదర్శన్‌రెడ్డిపై రెండునెలల నుంచి నిఘా పెట్టామని, అతను కొందరు ఆర్మీ ఉద్యోగులు ఆర్మీ క్యాంటీన్‌లో మద్యం వినియోగించుకోకుండా తమ కోటాలో వచ్చిన మద్యం బాటిళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి వినియోగదారులకు గుట్టుగా సరఫరా చేస్తున్నాడని వెల్లడించారు. ఇకపై ఆర్మీ ఉద్యోగులపై అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పట్టణంలో కొందరు నిర్వహించే ఫంక్షన్స్, పార్టీల్లో డిఫెన్స్ మద్యం సరఫరా చేస్తున్నట్లు తేలిందని, ఇలాంటి సందర్భాల్లో పట్టుబడితే ఫంక్షన్ హాలు నిర్వాహకులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిఫెన్స్ మద్యం లేదా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే 8712658872కు తెలియజేయాలని పేర్కొన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ కవిత, ఎస్ఐ రాజేందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడికి న్యూడ్ కాల్

- డబ్బులు ఇచ్చినా ఆగని వేధింపులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

దేవరకద్ర రూరల్: ఈజీ మనీ లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. అపరిచిత నెంబర్ నుంచి అమ్మాయితో న్యూడ్ కాల్స్ చేయించి ఓ యువకుడి నుంచి రూ.28వేలు కాజేసి మరిన్ని డబ్బులకు డిమాండ్ చేయడంతో వేధింపులు తాళలేక బాధిత యువకుడు పోలీసులను ఆశ్రయించిన ఘటన శుక్రవారం దేవరకద్రలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగన్న కథనం మేరకు.. నాగారం గ్రామానికి చెందిన కాశీపూరం శ్రీకాంత్ గతనెల 19న అపరిచిత నెంబర్ నుంచి న్యూడ్‌కాల్ వచ్చింది. లిఫ్ట్ చేసిన వెంటనే యువతి నగ్నంగా మాట్లాడగా.. అవాక్కయి కాల్‌కట్ చేశాడు. కాసేపటి తర్వాత నేరగాళ్లు ఫోన్ చేసి మార్ఫింగ్ చేసిన వీడియోలు పంపారు. మేము అడిగిన డబ్బులు ఇవ్వకపోతే నీవు ఇప్పుడు చూసిన న్యూడ్ వీడియోలు నీ ఫొటోతో సహ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరించారు. దీంతో యువకుడు కంగారుపడి రూ.28వేలను ట్రాన్స్‌ఫార్ చేశాడు. అయినప్పటికీ వేధింపులు అగకపోవడంతో ధైర్యం చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అపరిచిత కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని, మోసపోయామని భావిస్తే 1930కు కాల్ చేయడం లేదా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

శాంతిభద్రతల కోసమే కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

కొత్తకోట రూరల్: శాంతిభద్రత, నేరాల నియంత్రణను కట్టుదిట్టం చేసేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు అన్నారు. కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్ఐ ఆనంద్ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారు జామున కొత్తకోట పట్టణంలోని విద్యానగర్, శాంతినగర్, ఎన్టీఆర్ కాలనీల్లో 70 మంది పోలీస్ సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించడంతో పాటు, సరైన పత్రాలు లేని 50 బైక్‌లు, డీసీఎం వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలు గొడవలు, అసాంఘిక చర్యలకు దూరంగా ఉండాలన్నారు. ఇళ్ల యజమానులు తప్పనిసరిగా అద్దెకు ఉంటున్న వారి వివరాలను సేకరించి పోలీసులకు అందజేయాలని సూచించారు. అపరిచితులు, అనుమానాస్పదంగా కాలనీల్లో కనిపిస్తే 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మకూర్ సీఐ శివకుమార్, ఎస్ఐలు శివకుమార్, రామకృష్ణ, జయన్న, భాస్కర్, ఏఎస్ఐలు రోశయ్య, మన్నెపురెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు, యూరియా పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఎరువుల బస్తాలు తరలిస్తున్న వాహనాలు

నారాయణపేట: నారాయణపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో యూరియా, వివిధ రకాల ఎరువుల బస్తాలు పట్టుబడ్డాయని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. నారాయణపేట నుంచి వివిధ ఫర్టిలైజర్ దుకాణాలలో యూరియా వివిధ రకాల ఎరువుల బస్తాలను కర్ణాటకకు చెందిన రైతులు కొనుగోలు చేసి తీసుకువెళ్తున్న సమయంలో జలాల్‌పూర్ చెక్‌పోస్టు దగ్గర వాహనాల తనిఖీల్లో రెండు కమాండర్లు, ఒక ఆటోలో మొత్తం 34 బస్తాలలో యూరియా ఇతర ఎరువులను పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించామన్నారు. వారిని విచారించగా కర్ణాటక చెందిన కొంత మంది రైతులు నారాయణపేటలోని షాపులలో కొనుగోలు చేసి వ్యవసాయ పనుల నిమిత్తం తీసుకెళ్తున్నామని చెప్పారు. ఎంఏఓ బాలదినాకర్, ఏఈఓ అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా యోగా క్రీడాకారుల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళలు, పురుషుల వివిధ వయస్సు విభాగాల్లో యోగా క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, ఆర్.బాల్ రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్ - 18-21, 21-25, 25-30, 30-35, 35-45, 45 ఏళ్లకు పైబడి క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు ఫొటోతో హాజరుకావాలని, మిగతా వివరాల కోసం సెల్ నంబర్ 9492133490ను సంప్రదించాలని సూచించారు. యోగా సంఘం సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోమభూపాల్‌రెడ్డి

గండేడ్: విద్యుత్ సరఫరాను సకాలంలో పునరుద్ధరించలేదంటూ ఓ వ్యక్తి సబ్‌స్టేషన్ ఎదుట గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పల్లె సోమభూపాల్‌రెడ్డి వ్యవసాయంతో పాటు గ్రామంలో నీటిశుద్ధి కేంద్రాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. రూ.24 వేల విద్యుత్ బిల్లు బకాయి ఉండటంతో చెల్లించాలంటూ గురువారం లైన్‌మేన్ మన్నాజీ ఫోన్ చేశారు. మహబూబ్‌నగర్‌లో ఉన్నానని శుక్రవారం చెల్లిస్తానని తెలుపగా వినకుండా సిబ్బందితో కనెక్షన్ తొలగించారు. దీంతో చేసేది లేక శుక్రవారం 10.30 ప్రాంతంలో సల్కర్‌పేట్ సబ్‌స్టేషన్‌కు వెళ్లి బిల్లు చెల్లించి కనెక్షన్ పునరుద్ధరించాలని కోరారు. అందుకు లైన్‌మేన్ నిరాకరించి నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని చెప్పారు. దీంతో మరోమారు సబ్‌స్టేషన్‌కు వెళ్లి ఏఈ శ్రీకాంత్‌ను కలిసి తన సమస్యను వివరించారు. ఏఈ లైన్‌మెన్‌ను పిలిచి మాట్లాడినా కలెక్షన్‌లో ఉన్నాం.. రెండు గంటలకు ఇస్తామని బదులివ్వడంతో తనను వేధిస్తున్నారంటూ సోమభూపాల్‌రెడ్డి బైక్‌లో తన వెంట తెచ్చుకున్న గడ్డి మందును వారి ఎదుట తాగేందుకు యత్నించారు. అక్కడే ఉన్న ఆపరేటర్ హరినాయక్ అడ్డుకోవడంతో డబ్బా కిందపడింది. వెంటనే దాన్ని తిరిగి తీసుకొని రోడ్డు మీదకు పరిగెత్తి తాగేశాడు. గుర్తించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఏఈ శ్రీకాంత్‌ని వివరణ కోరగా విచారణ చేసి లైన్‌మేన్ నిర్లక్ష్యంపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి జైలుశిక్ష

గద్వాల క్రైం: చెక్ బౌన్స్ కేసులో జూనియర్ సివిల్ కోర్టు శుక్రవారం వ్యక్తికి జైలు శిక్ష విధించినట్లు న్యాయవాది ఆకుల శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాలకు చెందిన మేదరి శివశంకర్ తన స్నేహితుడు కేతు వంశీకృష్ణతో 2017లో రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. అయితే అప్పు తీర్చే క్రమంలో శివశంకర్ స్నేహితుడికి రూ.3లక్షల చెక్‌ను అందజేశాడు. వంశీకృష్ణ నగదు కోసం బ్యాంకులో చెక్ డిపాజిట్ చేయగా.. నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యింది. ఈ విషయంపై న్యాయం కోసం కేతు వంశీకృష్ణ కోర్టును ఆశ్రయించాడు. శుక్రవారం న్యాయమూర్తి పూర్వపరాలను పరిశీలించి, నిందితుడికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.6లక్షలు బాధితుడికి, రూ. 2వేలు జరిమానా చెల్లించాల్సిందిగా న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ తీర్పును వెల్లడించారన్నారు.

మరణంలోనూ వీడని స్నేహం

గుండెపోటుతో ఒకరు.. రోడ్డు ప్రమాదంలో మరొకరు...



భీమయ్య (ఫైల్)



చెన్నయ్య (ఫైల్)

మహమ్మదాబాద్: మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన కావలి భీమయ్య (55), గోగుల చెన్నయ్య (56) స్నేహితులు. ఇద్దరూ ఈ ప్రాంతంలోని బలభీమరాయ ఆంజనేయ భజన భక్తమండలి సభ్యులుగా ఉంటూ శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో నిత్యభజన కార్యక్రమంలో పాల్గొనేవారు. చివరి శనివారం తిరుమలలో అఖండ భజన చేయడానికి అవకాశం రావడంతో 14 మంది భక్తులు తుఫాన్ వాహనంలో గురువారం బయలుదేరారు. మార్గమధ్యంలో భీమయ్యకు గుండెపోటు రావడంతో కోవెలకుంట్లలోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో వారంతా మృతదేహంతో వెనుదిరిగి శుక్రవారం ఉదయం 4 గంటల సమయంలో స్వగ్రామానికి చేరుకున్నారు. ఉదయం అంత్యక్రియలకు సామగ్రి తీసుకొచ్చేందుకు చెన్నయ్య బైక్‌పై మహమ్మదాబాద్ వెళ్తూ మార్గమధ్యంలో కమతం రాంరెడ్డి తోట దగ్గర ప్రమాదవశాత్తు రహదారి పక్కనున్న రాతి కడీని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఇద్దరు మిత్రులు ఒకేసారి మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భీమయ్య అంత్యక్రియలు పూర్తికాగా.. పోస్టుమార్టం అనంతరం శనివారం చెన్నయ్య అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు వివరించారు. ఆయా కుటుంబాలను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పరామర్శించారు.

హర్రర్, కామెడీ జానర్‌లోనే ‘అవంతిక-2’



ఆలయంలో పూజలు చేస్తున్న అవంతిక చిత్ర యూనిట్

- సినీ నటుడు, దర్శకుడు శ్రీరాజ్‌భళ్ల
- పెద్దగుట్టపై సినిమా షూటింగ్ ప్రారంభం
- క్లాప్‌కొట్టి కొట్టి ప్రారంభించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: ఒక్కో దర్శకుడికి ఒక్కో జానర్ అంటే ఇష్టమని, తనకు హర్రర్, కామెడీ జానర్ అంటే ఇష్టమని నటుడు, దర్శకుడు శ్రీరాజ్ భళ్ల పేర్కొన్నారు. శుక్రవారం జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలోని బాదేపల్లి పెద్దగుట్టపై రంగనాయక స్వామి ఆలయంలో అవంతిక-2 సినిమా షూటింగ్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసింహాపురం రివేంజ్, అవంతిక హారర్ కామెడీ జానర్‌లో తీశామన్నారు. అవంతిక-2 సినిమాను కూడా హారర్ కామెడీ జానర్‌లోనే తీస్తున్నామన్నారు. రాంగోపాల్‌వర్మతో అన్నమయ్య సినిమా ఊహించలేమని, అలాగే రాఘవేంద్రరావుతో హారర్ సినిమా ఆశించలేమన్నారు. బలగం లాంటి సినిమా వేణుతోనే సాధ్యమైందని, అలాంటి జానర్‌లు తాను తీయలేనన్నారు. అందుకే హారర్ కామెడీ సినిమాలు తీస్తున్నామన్నారు. బాదేపల్లికి చెందిన ఫణిరాజ్‌తో పదేళ్ల ప్రయాణం కొనసాగుతుందని, అవంతికలో క్షుద్రపూజలు, మూఢనమ్మకాల గురించి తీశామని, అవంతిక కథ ఇప్పుడే బయటపెట్టమన్నారు. ఈ సినిమాకు ఫణిరాజ్ క్రియేటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారని, గీతాంజలి హీరోయిన్‌గా, రామకృష్ణ శాస్త్రి నిర్మాతగా వ్యవహరిస్తున్నారని వెల్లడించారు.

ప్రాంత నటులకు ప్రాధాన్యత

జడ్చర్ల, మహబూబ్‌నగర్ జిల్లాలో అనేకమంది ప్రతిభ గల నటులున్నారని, వారిలో కొందరికైనా అవకాశం కల్పించాలన్న పట్టుదలతో ఫణిరాజ్ ఉన్నారని, అందుకు త్వరలోనే అడీషన్స్ నిర్వహిస్తామన్నారు. హీరోయిన్ గీతాంజలి మాట్లాడుతూ.. అవంతిక 2 సినిమా సక్సెస్ కావాలని కోరుకుంది. గత సినిమాల షూటింగ్ ఇక్కడ జరగగా తనకు ఎంతో అనుబంధం ఏర్పడిందన్నారు. అవంతిక-2తోపాటు మరో 3సినిమాల్లో నటిస్తున్నట్లు వివరించారు.

ఔత్సాహికులకు సహకారం

ప్రతిభ ఉన్న నటులు, ఔత్సాహికులకు అవకాశం కల్పిస్తామని అవంతిక 2 టీం ప్రకటించడంపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అభినందనలు తెలిపారు. సినిమా గొప్ప విజయం సాధించి జడ్చర్లకు పేరు తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని వెల్లడించారు.

రంగనాయకస్వామి ఆలయంలో పూజలు

అవంతిక 2 సినిమా స్క్రిప్టును లక్ష్మీసమేత రంగనాయకస్వామి ఆలయంలో ఉంచి పూజలు చేశారు. అనంతరం హీరో, హీరోయిన్‌పై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి క్లాప్‌కొట్టి సినిమాను ప్రారంభించారు. కార్యక్రమంలో సినిమా క్రియేటివ్ డైరెక్టర్ ఫణిరాజ్‌గౌడ్, ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వరాంరెడ్డి, వార్డుకౌన్సిలర్‌లు రఘురాంగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, దేవా, ఉమాశంకర్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.